
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శనివారం 22 జూన్ 2024



అల్లూరి స్మారక పార్కులో కళామందిరం

- మన్యం వీరుడి చరిత్రను చాటి చెప్పే 30 చిత్రపటాలు ఏర్పాటు
- వచ్చే నెల 4న ఆవిష్కరణ
- జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రరావు

- 5లో



అనకాపల్లిలోనూ అదే వరస!

వైసీపీ దందా



అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటలో వైసీపీ కార్యాలయం కోసం జీవీఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన ప్యాలెస్

జీవీఎంసీ అనుమతులు లేకుండానే పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మాణం

- హైవే సమీపంలో 1.75 ఎకరాలు 33 ఏళ్ల లీజుకు...
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి...
- ఏడాదికి ఎకరానికి కేవలం రూ.1000 చెల్లించేలా ఉత్తర్వులు
- స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేసినా పట్టించుకోని వైనం
- హైకోర్టును ఆశ్రయించిన కొత్తూరు నర్సింగరావుపేట గ్రామస్థులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ సాగించిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. విశాఖపట్నంలో మాదిరిగానే అనకాపల్లిలోనూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకుని పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ నిర్మించారు. జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవ్ కాకుండానే కేవలం దరఖాస్తు చేసి భవన నిర్మాణ పనులు చకచకా కానిచ్చేశారు.

అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ కొత్తూరు నర్సింగరావుపేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 75/1లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ స్థలం జిల్లా పార్టీ కార్యాలయానికి కేటాయించేలా వైసీపీ నాయకులు 2022లో పావులు కదిపారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు 75/1లోని ఒక ఎకరా 75 సెంట్ల స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి మరీ పార్టీ కార్యాలయానికి కేటాయించేశారు. జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతంలో ఎకరా రూ.8 కోట్లు నుంచి రూ.10 కోట్లు వరకూ పలుకుతోంది. కానీ వైసీపీ పెద్దలు ఏడాదికి కేవలం ఎకరాకు రూ.వెయ్యి చొప్పున చెల్లించేలా 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అంటే ఏడాదికి కేవలం రూ.1,750 మాత్రమే ప్రభుత్వానికి చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి 340 జీవో ప్రకారం రాజకీయ పార్టీలు, సంస్థలకు స్థలాలు కేటాయించాల్సి వస్తే..ప్రజాధనంతో అభివృద్ధి చేయని ప్రభుత్వ, బంజరు భూములను మాత్రమే ఇవ్వాలి. కానీ వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిబంధనలు పక్కనపెట్టి సర్వే నంబరు 75/1లో వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన ఎకరా 75 సెంట్ల స్థలాన్ని 2022 డిసెంబరు 20న జీఓ నంబరు 759 ఆధారంగా కేటాయించుకున్నారు.

జీవీఎంసీ ప్లాన్ అప్రూవ్ కాకుండానే..

నాటి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పేరుతో జీవీఎంసీ ప్లానింగ్ విభాగానికి భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కానీ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫీజులేవీ చెల్లించకపోవడంతో ఇంతవరకూ అధికారికంగా ప్లాన్ అప్రూవ్ కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చిన లీజు భూమిలో నిర్మాణ పనులు చేపట్టాల్సి వస్తే గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, పచ్చదనం పెంపు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీలు కింద రూ.1.54 లక్షలు అంతా కలిపి రూ.17 లక్షల వరకూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆన్‌లైన్‌లో చెల్లించాలి. మొత్తం ఫీజు చెల్లించిన తరువాతే బిల్డింగ్ ప్లాన్ అధికారి క్షేత్ర పర్యటన చేసి, ప్లాన్ అప్రూవ్ చేస్తారు. కానీ వైసీపీ నాయకులు కేవలం ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకొని పనులు మొదలెట్టేశారు. వైసీపీ కార్యాలయ భవనానికి స్థలాన్ని కేటాయించవద్దంటూ స్థానికులు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణం దాదాపు పూర్తిచేసేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడికి చెందిన రాంకీ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ భవన నిర్మాణం చేపట్టింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ పనులు నిలిపేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భవన నిర్మాణాలకు

... మిగతా 6వ పేజీలో

వలంటీర్లు విలవిల!

ఎన్నికల ముందు వైసీపీ నేతల మాయ మాటలు విని రాజీనామాలు

- జిల్లా వ్యాప్తంగా 5,670 మంది వలంటీర్లు
- రాజీనామా చేసింది 526 మందే..
- కూటమి అధికారంలోకి రాకతో అయోమయం
- విధుల్లోకి తీసుకోవాలని వేడుకోలు
- వేతనం రూ.10 వేలు కానుండడంతో మళ్లీ చేరాలని ఆశ పడుతున్న వలంటీర్లు



విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ విజయసునీతకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు వైసీపీ నేతల మాయ మాటలు విని రాజీనామాలు చేసిన వలంటీర్లు ఇప్పుడు మదనపడుతున్నారు. తమను బెదిరించి రాజీనామాలు చేయించారని, ఆదుకోవాలంటూ గగ్గోలు పెడుతున్నారు. ఒకప్పుడు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం పెంచనున్న గౌరవ వేతనంపై ఆశతో మళ్లీ అవకాశం కల్పించాలంటూ జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలోని 22 మండలాల్లో 352 సచివాలయాల్లో 5,670 మంది గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు, ఐప్యాక్ బృందం మాయ మాటలు విని రాజీనామాలు చేసిన 526 మంది గ్రామ వలంటీర్లు ప్రస్తుతం ఉద్యోగం పోయి విలవిల్లాడుతున్నారు. రానున్నది వైసీపీ ప్రభుత్వమే అన్న ధీమాతో రాజీనామాలు చేసిన వలంటీర్లంతా తమ భవిష్యత్తు ఏమిటో అర్థంకాక నేడు తలలు పట్టుకుంటున్నారు. తమ ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ ఏడాది మార్చి నెల నుంచే గ్రామ వలంటీర్లతో రాజీనామాలు చేయించే ప్రక్రియకు వైసీపీ నేతలు శ్రీకారం చుట్టారు. వైసీపీ నేతలు వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి, ఐప్యాక్ టీమ్‌ను ఆహ్వానించేవారు. వలంటీర్ల పరిధిలో ఉండే ఓటర్లతో ఎలా మాట్లాడాలి.. వైసీపీకే వారంతా ఓటు వేసేలా ఎలా ఒప్పించాలనే అంశాలను ఐప్యాక్ టీమ్ వివరించేది. అలాగే ఆ సమయంలో జిల్లా యంత్రాంగం ఎన్నికలకు సంబంధించిన పనుల్లో నిమగ్నం కావడం, గ్రామ సచివాలయ సిబ్బంది సైతం వలంటీర్ల కదలికలపై ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో వైసీపీ నేతల రహస్య సమావేశాల వివరాలు అధికారుల దృష్టికి రాని పరిస్థితి నెలకొంది. అందువల్లే గిరిజన ప్రాంతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న ఒక్క వలంటీర్‌పైనా అధికారులకు ఫిర్యాదులు చేసిన దాఖలాలు లేవు. దీంతో ఇదే అదనుగా అనేక మంది వలంటీర్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం పక్కన పెట్టి వైసీపీ నేతలతో చెట్టాపట్టాలేసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఎన్నికల ప్రచారం చేశారు.

వైసీపీకి అనుకూలంగా లేని వారికి బెదిరింపులు..

ఏజెన్సీలో వైసీపీకి అనుకూలంగా లేనివారిని, రాజీనామాలు చేయని వలంటీర్లను ఆ పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. వలంటీర్ల సంఘం నేతల పేరిట ఐప్యాక్ టీమ్ సభ్యులే వారిని వేధించారు. ఇప్పుడు రాజీనామా చేసి వైసీపీ గెలుపునకు కృషి చేసిన వారికి మాత్రమే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తు ఉంటుందని తేల్చి చెప్పేశారు. వైసీపీ నేతలు, ఐప్యాక్ టీమ్ ఎంతగా బెదిరించినా ఏజెన్సీలో ఆశించిన స్థాయిలో వలంటీర్లు రాజీనామాలు చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో ముందు జాగ్రత్త చర్యగా కొందరు వలంటీర్లు రాజీనామాలు చేయకుండా ఉండిపోయి వైసీపీకి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలున్నాయి.

విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్ల వేడుకోలు

వైసీపీ నేతల మాయ మాటలు విని రాజీనామాలు చేసిన మోసపోయామని, తమను విధుల్లోకి తీసుకోవాలని ఏజెన్సీలో రాజీనామాలు చేసిన వలంటీర్లు కొద్ది రోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈమేరకు ఇదే అంశంపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీతకు రాజీనామాలు చేసిన వలంటీర్లు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

ఉదయం సూర్యప్రతాపం
సాయంత్రం వరుణుడి కరుణ

ఏజెన్సీలో చల్లబడిన వాతావరణం



శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిచి ముద్దయిన పాడేరు మెయిన్ రోడ్డు

పాడేరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మన్యంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎప్పటి వలె వేసవి వాతావరణం కొనసాగింది. ఆ తర్వాత నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో అప్పటివరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో ముసురు వాతావరణాన్ని తలపిస్తూ ఆహ్లాదకరంగా మారింది.

కొయ్యూరులో 36.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

ఏజెన్సీలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రంగా ఎండ కాయడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెద్దగా తగ్గలేదు. కొయ్యూరులో 36.8, అనంతగిరిలో 32.7, జి.మాడుగులలో 31.7, చింతపల్లిలో 31.1, పాడేరులో 30.4, అరకులోయలో 29.4, హుకుంపేటలో 29.3, ముంచంగిపుట్టులో 27.9, పెదబయలులో 29.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయసునీత ఆదేశం

- సీజనల్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తేవాలి
- నీటి నమూనా పరీక్షల కిట్లు సిద్ధం చేయాలి
- తక్షణ వైద్య సేవలు అందాలి
- జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత

పాడేరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డయేరియా పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డయేరియా నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అధికారులు చైతన్యం చేయాలన్నారు. తాగునీటి ద్వారా సక్రమించే డయేరియా రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులు, బావులను క్లోరినేషన్ చేయడం, కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి చేపట్టాలన్నారు. అలాగే పంచాయతీ స్థాయిలో తాగునీటి నమూనాలను పరీక్షించేందుకు అవసరమైన కిట్లు, పరికరాలను సిద్ధం చేయాలని, తాగునీటి ద్వారా ప్రజలకు ఎటువంటి రోగాలు రాకూడదన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. అలాగే వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏఆర్ఎస్ ప్యాకెట్‌లు, జింక్ మాత్రలు అవసరం మేరకు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ప్రజలు రోగాల బారిన పడితే తక్షణమే వైద్య సేవలు అందేలా వైద్యశాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యులు లేరు, సిబ్బంది రాలేదు వంటి సమాధానాలు చెబితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. తాగునీటి, వైద్య సేవలపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

డయేరియాపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

రానున్న వ్యాధుల సీజన్ నేపథ్యంలో డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అనివార్య పరిస్థితుల్లో ప్రజలు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సీఎస్ ఆదేశించారు. అలాగే మలేరియా కేసుల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ భాషా, జిల్లా మలేరియా అధికారి కృష్ణారావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, గ్రామీణా నీటి సరఫరా విభాగం ఈఈ లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు

16 కిలోల గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులతో ఎస్ఐ అరుణ్ కిరణ్, పోలీసులు

చింతపల్లి, జూన్ 21: పాడేరు ఏజెన్సీ మీదుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 16 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్టు చింతపల్లి ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. నిందితుల నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం లోతుగెడ్డ సమీపంలోని మామిడిపల్లి కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారు అదే మార్గంలో వస్తూ తమను గమనించి

... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం



అసెంబ్లీలో శుక్రవారం శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న విశ్వేశ్వరరాజు (పాడేరు), రేగం మత్స్యలింగం (అరకులోయ)

ఏవోబీలో మావోల డంప్ స్వాధీనం



ఏవోబీలో మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్న ఒడిశా పోలీసులు

సీలేరు, జూన్ 21: ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో శుక్రవారం మావోయిస్టుల డంప్‌ను ఒడిశా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీలేరు నదికి అవతల బెజ్జంగివాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో బీఎస్ఎఫ్, ఎస్‌వోజీ బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని కూర్మనూరు పంచాయతీ దూలగండి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన డంప్‌ను పోలీసులు వెలికితీశారు. ఇందులో మూడు ఎస్‌బీఎంఎల్ తుపాకీలు, మూడు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 98 జిలిటెన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్‌తో పాటు ఇతర సామగ్రి లభ్యమైంది.

క్రైం... crime news

శారదా నదిలో పడి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, జూన్ 21: ఇక్కడి శారదా నదిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. శ్రీరామనగర్ కాలనీకి చెందిన మారేడుపూడి రాము (33) ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి బహిర్భూమికని సమీపంలోని శారదా నదికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం నది ప్రాంతంలో వెతకగా చెప్పులు, చొక్కా కనిపించాయి. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. చివరకు సాయంత్రం ఐదు గంటల సమయంలో రైల్వే ట్రాక్ కింద నదిలో మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ వివరించారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మద్యం మత్తులో ఒడిశా వాసి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

పరవాడ, జూన్ 21: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఒడిశా రాష్ట్రానికి చెందిన బి.చంద్రశేఖర్ (43) తన తల్లి, బావ విజయ్‌కుమార్‌తో కలిసి గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉండేవాడు. ఇతనికి వివాహం కాలేదు. మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటుండగా, ఈ నెల 17న చంద్రశేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో అదే రోజు రాత్రి పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే, శుక్రవారం ఉదయం పదకొండు గంటల సమయంలో జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి ఆనుకుని ఉన్న ఏపీ టిడ్కో గృహ సముదాయాల సమీప తుప్పల్లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతుడు చంద్రశేఖర్‌గా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. మద్యం మత్తులో మృతిచెంది ఉంటాడని అతని బావ విజయ్‌కుమార్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మరొకరు..

అచ్యుతాపురం, జూన్ 21 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు సీఐ బుచ్చిరాజు శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలివి. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జారం గ్రామానికి చెందిన బొప్పే పార్వతీశ్వర్ (40) ఇక్కడి కర్మాగారంలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి అచ్యుతాపురం పూడిమడక రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈనెల 19 రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో పూడిమడక రోడ్డులో గల తన నివాసానికి నడిచి వస్తుండగా, సబ్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన అతనిని వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందినట్టు సీఐ తెలిపారు. మృతుని తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తల్లీకూతురు అదృశ్యం

కృష్ణాదేవిపేట, జూన్ 21: గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన తల్లీకూతురు అదృశ్యమైనట్లు భర్త ఫిర్యాదు చేసినట్లు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. వివరాలిలావున్నాయి. లింగంపేట గ్రామానికి చెందిన సందిపర్తి శ్రీను భార్య సందిపర్తి వెంకటలక్ష్మి (26), కుమార్తె శశిరత్నం(8) గురువారం ఉదయం బయటకు వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళారు. తిరిగి రాత్రి అవుతున్నా ఇంటి రాకపోవడంతో బంధువులు ఇళ్ళకి వెళ్ళి వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శ్రీను శుక్రవారం కృష్ణాదేవిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కృష్ణాదేవిపేట ఫోన్ : 94409 04240 నంబర్‌కు తెలపాలని ఎస్‌ఐ ఉపేంద్ర కోరారు.

మూడు తులాల బంగారు ఆభరణాల చోరీ

కోటవురట్ల, జూన్ 21: మండలంలోని కొడవటిపూడిలో ఓ ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ గుడాల విజయకుమార్ తెలిపిన వివరాలివి. కొడవటిపూడిలో బాలేపల్లి రమణ నివాసం ఉంటున్నాడు. ఇతని భార్య పాయకరావుపేట సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమెతో పాటు పిల్లలు కూడా అక్కడే చదువుకుంటున్నారు. ఈనెల 15వ తేదీ శనివారం ఇంటికి తాళాలు వేసి, వారిని చూసేందుకు రమణ వెళ్లాడు. శుక్రవారం రమణ సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా, ఇంటి తలుపు తీసి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే సోదరుడు రమణకు సమాచారం అందించాడు. అతడు వచ్చి బీరువాలో ఉంచిన మూడు తులాల ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

గంజాయితో ముగ్గురి అరెస్టు

కొయ్యూరు, జూన్ 21: చీడిపాలెం కూడలి వద్ద 15 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. గూడెంకొత్తవీధి మండల ధారకొండకు చెందిన కిల్లో సూరిబాబు, కిల్లో సంహాచలం, తమిళనాడు మధురైకు చెందిన ధర్మార్‌మణిలను అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు.

కోడికత్తి కేసు విచారణ జూలై 4కి వాయిదా

జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందేనన్న న్యాయవాది సలీం


మాట్లాడుతున్న విదసం నేత వెంకటరావు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసు విచారణ జూలై నాలుగో తేదీకి వాయిదా పడింది. ఐదున్నర సంవత్సరాల క్రితం జె.శ్రీనివాసరావు కోడికత్తితో జగన్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ శుక్రవారం విశాఖపట్నం ఎన్‌ఐఏ కోర్టులో జరిగింది. నిందితుడు శ్రీనివాసరావు కోర్టుకు హాజరుకాగా, బాధితుడు, ప్రధాన సాక్షి అయిన జగన్ రాకపోవడంతో కేసును వాయిదా వేశారు. దీనిపై న్యాయవాది సలీం మాట్లాడుతూ, ఇన్నాళ్లు ముఖ్యమంత్రిని అంటూ విచారణకు హాజరు కాలేదని, ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యే కాబట్టి తప్పించుకోలేరన్నారు. కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందేనన్నారు. విదసం నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ, పోలీసులు ఈ కేసులో పక్షపాత ధోరణి విడనాడాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి రెండో కేసు నమోదైందని, అందులో నిందితులైన వైసీపీ నాయకులు కేకే రాజు, అదీప్‌రాజ్ తదితరులను కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కోడికత్తితో దాడికి సంబంధించి శ్రీనివాస్‌పై 648 నంబరుతో కేసు నమోదైందని, ఈ ఘటన తరువాత వైసీపీ నాయకులు జగన్‌పై దాడిని నిరసిస్తూ హైవేలో వాహనాలను అడ్డగించారని, భారత క్రికెట్ ఆటగాళ్ల బస్సుపై, పోలీసుల వాహనాలపై రాళ్లు వేసి అద్దాలు పగలగొట్టారని, దానిపై 649 నంబరుతో కేసు నమోదైందని, దానిని పోలీసులు ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. వారికి ఓ నిబంధన, తమకు ఒక నిబంధనా? అంటూ నిలదీశారు. ఈ కేసులో అవసరమైతే పోలీసులు రివ్యూ పిటిషన్ వేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిందితుడు శ్రీనివాస్ సోదరుడు సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

సరుగుడు సాగు.. బాగుబాగు


గిట్టుబాటు ధర పలుకుతుండడంతో రైతుల ఆసక్తి

సరుగుడు తోట

- ఐదేళ్లలో ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం
- వరి, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు
- మండలంలో 9 వేల విస్తీర్ణంలో పెంపకం

బుచ్చెయ్యపేట, జూన్ 21: తక్కువ పెట్టుబడి.. ప్రతికూల పరిస్థితులతో సంబంధం లేకుండా పంట చేతికొచ్చే పరిస్థితులు ఉండటంతో రైతులు అధికంగా సరుగుడు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆరుగాలం పండించినా ఆహార పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్న ఆవేదనతో రైతులు పుష్కలంగా సాగునీరు ఉన్న ప్రాంతాల్లోనూ సరుగుడు తోటలను పెంచడం ప్రారంభించారు. ఒకసారి నాటితే ఐదు సంవత్సరాలకు చేతికి అందే సరుగుడు కలప రైతుకు ఆర్థికంగా చేయూతనిస్తుంది. ప్రస్తుతం క్లోన్ మొక్కలు అందుబాటులోకి వచ్చాయి. ఎకరాకు 70 నుంచి 100 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది. ఎకరాకు సరాసరి సుమారు రూ.5 లక్షలు పైబడి పంట ఆదాయం రావడంతో రైతులకు కాస్త గిట్టుబాటు అవుతోంది.

ఒకప్పుడు ఎకరాకు రూ.2 లక్షలు పైబడి ఆదాయం రావడం కష్టంగా ఉండేది. అలాంటిది ఐదేళ్ల వయస్సు గల సరుగుడుకి సంవత్సరానికి ఎకరానికి రూ.లక్షకు పైగా మొత్తం ఐదేళ్లకి ఐదు లక్షల రూపాయలకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులందరూ సరుగుడు సాగు వైపు మొగ్గ చూపుతున్నారు.

9 వేల విస్తీర్ణంలో సరుగుడు సాగు

మండలంలో కనిష్ట స్థాయిలో ఉండే సరుగుడు సాగు విస్తీర్ణం, నేడు చెరకు, వరి సాగు విస్తీర్ణాన్ని అధిగమించింది. ప్రస్తుతం 9 వేల ఎకరాలకు పైబడి విస్తీర్ణానికి ఎగబాకి అధిక సాగు విస్తీర్ణంలో మొదటి స్థానంలో నిలిచింది. ఒకప్పుడు వర్షాధారంగా, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరుగుడు సాగు, నేడు నీటి వనరులు కలిగిన పల్లపు భూముల్లో సైతం సరుగులు సాగు అవుతోంది. దీనికి కారణం గత కాలంగా సరుగుడు ధరలు గణనీయంగా పెరుగుతూ గరిష్ట స్థాయి చేరుకోవడమే. ఒకప్పుడు చెరకు సాగు ఆసక్తి చూపడంతో ప్రధాన పంటగా ఎదిగిన చెరకు సాగు నేడు కనిష్ట స్థాయికి పడిపోయింది. గణనీయంగా పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా చెరకు ధరలు పెరగకపోవడం, సరఫరా చేసిన చెరకు గోవాడ షుగర్ ప్యాక్టరీ యాజమాన్యం చెల్లింపులను నెలల కాలం చేయకపోవడంతో మండలంలో చెరకుకు ప్రత్యామ్నాయంగా రైతుల సరుగుడు సాగును ఎంచుకున్నారు. అలాగే వరి సాగు గిట్టుబాటు కాకపోతుండడం కూడా ఒక కారణం.


బంగారుమెట్టలో సరుగుడు నరుకుతున్న రైతులు.

ధర పెరగడమే కారణం..

ప్రస్తుతం మార్కెట్లో సరుగుడు ధరలు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో ఈ సాగుపై రైతులు మక్కువ పెంచుకుంటున్నారు. మార్కెట్లో ఆరు నెలల క్రితం వరకు టన్ను బాదు రకం రూ. 4,800లు, ముక్క రకం రూ. 2,850లు ఉండగా, గత రెండు మూడు నెలలుగా సరుగుడు ధర క్రమేపీ పెరగడంతో నేడు టన్ను బాదు రకం రూ.7 నుంచి 8 వేలు, ముక్క రకం రూ.6,100 లు పలుకుతోంది. దీంతో మెట్టు, పల్లం తేడా లేకుండా నీటి వనరులు కలిగి వాణిజ్య పంట సాగు చేసే రైతులు కూడా సరుగుడు సాగు చేపట్టారు. వడ్డాది, లోపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం, ఎల్‌బీపీ అగ్రహారం, పొట్టి దొరపాలెం, కొండెంపూడి, గంటికొర్లాం, కోమళ్లపూడి, కొండెంపూడి, కేపీ అగ్రహారం, కొండపాలెం, బుచ్చెయ్యపేట, కందిపూడి, దిబ్బిడి, పొలేపల్లి, రాజాం, నీలకంఠాపురం, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, మల్లాం, లైపురం, చిట్టియ్యపాలెం, పెదమదీన, గున్నెంపూడి, కరక, తురకలపూడి, చిట్టియ్యపాలెం, పెదపూడి, పీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో సరుగుడు సాగునే చేపట్టారు. వరి, చెరకుతో పాటు ఉద్యాన పంటల స్థానంలో రైతులు సరుగుడు సాగు చేపట్టారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన ప్లైవుడ్ తయారీ కర్మాగారానికి రోజుకు వెయ్యి టన్నుల వరకు సురుగుడు, సుబాబుల్ అవసరం కావడంతో మార్కెట్లో ఈ తోటలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలకు ఢోకా ఉండదన్న ధీమాతో రైతులు ఉన్నారు.

అల్లూరి స్మారక పార్కులో కళామందిరం

- మన్యం వీరుడికి చరిత్రను చాటి చెప్పే 30 చిత్రపటాలు ఏర్పాటు
- వచ్చే నెల 4న ఆవిష్కరణ
- జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రరావు


పుస్తకాలను అందిస్తున్న పడాల వీరభద్రరావు

కృష్ణాదేవిపేట, జూన్ 21: వచ్చే నెల 4న స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని కృష్ణాదేవిపేటలోని పార్కు ఆడిటోరియంలో అల్లూరి చరిత్రకు సంబంధించి 30 భారీ చిత్రపటాలతో కళామందిరం ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి, గంటందొర సమాధుల వద్ద ఆయన నివాళులు అర్పించారు. అనంతరం పార్కులోని ఆడిటోరియంలో అల్లూరి చిత్రపటాలు ఏర్పాటు కోసం రాజమండ్రి మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవిప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. కొలతలు వేసి పనులు ప్రారంభించారు.


అల్లూరి చరిత్ర చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన 2/3 అడుగుల సైజు 30 చిత్రాలను తమ సంఘం పార్కులోని ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా అల్లూరి చిత్ర కళామందిరం ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అల్లూరిపార్కు అభివృద్ధికి రూ.కోటి 16 లక్షలు నిధులు ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రూ.30 లక్షలు కేటాయించటం శుభపరిణామం అన్నారు. మాదేటి రవిప్రకాష్ మాట్లాడుతూ అల్లూరి చరిత్రకు సంబంధించిన చిత్రపటాలను డిల్లీ, హైద్రాబాద్, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు తిలకించి అభినందించారన్నారు. అనంతరం స్థానిక అల్లూరి మైత్రి గ్రంథాలయానికి ప్రముఖ రచయితలు రాసిన విలువైన 20 పుస్తకాలను వీరభద్రరావు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాలరాజు, సభ్యులు భాస్కరమణి, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23న తీరప్రాంత నియంత్రణ జోన్ ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ

నర్సీపట్నం, జూన్ 21: తీర ప్రాంత నియంత్రణ-2019 ముసాయిదా నోటిఫికేషన్‌పై జూలై 23న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రజాభిపాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. శుక్రవారం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ముసాయిదా నోటిఫికేషన్ పత్రాలను నోటీస్ బోర్డులో పదర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తీర ప్రాంతంలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పరవాడ మండల ప్రజలు, మత్స్య కారులు ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చన్నారు. తీరప్రాంతాలలోని మత్స్యకార సంఘాలు, ఇతర వార్గాల జీవనోపాధి భద్రతతో పాటు తీర ప్రాంతాలు, సముద్ర ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ సూత్రాలు ఆధారంగా స్థిర మైన అభివృద్ధిని ప్రోత్సహించడం నోటిఫికేషన్ ప్రధాన లక్ష్యమని ఆర్డీవో పేర్కొన్నారు.


నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న ఆర్డీవో జయరాం

పోలీస్ గ్రీవెన్స్ సెల్‌కు 15 వినతులు


ఎస్పీకి సమస్యను వివరిస్తున్న ఉద్యోగి

అనకాపల్లి రూరల్, జూన్ 21: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదిహేను మంది పోలీస్ సిబ్బంది వినతులు సమర్పించేందుకు రాగా, అందరితో ఎస్పీ కేవీ మురళీకృష్ణ స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనారోగ్యం, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను పలువురు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్ల ఎంపిక రేపు

అచ్యుతాపురం, జూన్ 21: జిల్లాస్థాయి జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ జట్ల ఎంపిక ఈ నెల 23న అచ్యుతాపురం మండలంలో జరగనుందని సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్. దేముడు తెలిపారు. ఇక్కడి పూడి ఆర్.ఆర్.కాలనీలో గల స్విమ్మింగ్ పూల్‌లో ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ై పోటీల్లో ప్రతిభ చూపినవారు జిల్లా జట్టుకు ఎంపిక కానున్నారన్నారు. వీరు జూలై 13, 14 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 95736 90954 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

'నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయండి'

అనకాపల్లి టౌన్, జూన్ 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులకు నియామకమైనవారు ఆయా పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నామినేటెడ్ పదవులు పొందినవారు ప్రస్తుతం ఆ ప్రభుత్వం మారిపోయినందున తమ పదవులను వదులుకోవడం నైతిక బాధ్యతగా పేర్కొన్నారు.

జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటుకు కృషి

- ఏపీ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.కృష్ణ మోహన్

నర్సీపట్నం, జూన్ 21: జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఏపీ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.కృష్ణ మోహన్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా శుక్రవారం నర్సీపట్నం వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ జిల్లా అదనపు న్యాయస్థానం, కోర్టు సముదాయంలో వసతులు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రావాడ సత్యనారాయణ, లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరి నరసింహం, నాగేశ్వరరావు, మెట్టా ప్రభాకర్, కామిరెడ్డి సత్యనారాయణ, చింతల ప్రకాశ్, అనిమిరెడ్డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


అనకాపల్లిలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 21: ప్రతిరోజూ యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గవరపాలెం బీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో శుక్రవారం ఆయుష్ విభాగం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటై వేడుకలను ఎస్పీ మురళీకృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా విశిష్టతను, ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ యోగా వల్ల ఎన్నో మంచి ఫలితాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, ఆయుష్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో యోగాడేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగా డే ఇంగ్లీషు అక్షరాల్లో కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 10 అడుగుల కొండచిలువ హతం


హతమార్చిన కొండచిలువ

రోలుగుంట, జూన్ 21: మండలంలోని కొవ్వూరులో 10 అడుగుల కొండచిలువను శుక్రవారం గ్రామస్థులు హతమార్చారు. ఈ గ్రామానికి చెందిన యర్రంశెట్టి సత్తిబాబు ఇంటి సమీపంలోని తుప్పల్లో 10 అడుగుల కొండచిలువ కోడిని మింగుతూ కనిపించింది. దీంతో భయపడిన సత్తిబాబు స్థానికుల సహాయంతో కొండచిలువను కర్రలతో కొట్టి హతమార్చారు. ఇంతకు ముందెన్నడూ గ్రామంలోకి ఇలాంటి కొండచిలువ రాలేదని స్థానికులు తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ


ఆది దంపతుల ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 21: స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి వేదమంత్రాల నడుమ పెంటకోట బాలకృష్ణ శకుంతల, సంతోష్ రామలక్ష్మి దంపతులు ఊంజలసేవను జరిపారు. గౌరీ గీతా మహిళా మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృతవర్షిణి సభ్యులు చక్కని గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'సుందరపు' రాక రేపు

- భారీగా స్వాగతం పలికేందుకు కూటమి శ్రేణులు ఏర్పాట్లు


ఎలమంచిలి జనసేన కార్యాలయంలో సమావేశమైన కూటమి నేతలు

ఎలమంచిలి/రాంబిల్లి, జూన్ 21 : ఎమ్మెల్యేగా గెలుపొంది, ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గానికి విచ్చేస్తున్న సుందరపు విజయకుమార్‌కు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలి రావాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎలమంచిలిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 23వ తేదీ ఆదివారం ఎమ్మెల్యే సుందరపుతో పాటు ఎంపీ సీఎం రమేష్, ప్రముఖులు కలిసి ముందుగా ఏటికొప్పాక గ్రామ దేవత బండిమాంబ అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. అనంతరం పులపర్తి జంక్షన్ చేరుకుని జాతీయ రహదారి మీదుగా ఎలమంచిలి చేరుకుని రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా సైతారుపేట రోడ్డు జంక్షన్ నుంచి బైక్ ర్యాలీగా అచ్యుతాపురం జంక్షన్‌కు చేరుకుంటాన్నారు. అనంతరం అక్కడ జరిగే భారీ బహిరంగ సభలో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో కూటమి నేతలు అన్నం బాబ్జీ, లాలం సోమునాయుడు, రమేష్, ఆదిమూర్తి, గుర్రాల శేఖర్, ఇత్తంశెట్టి నాయుడు, నక్కా వెంకటరామన్, సుంకర బుల్లిబాబు, కొటారు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలంలోని హరిపురం జనసేన కార్యాలయంలో కూటమి నేతలు బైలపూడి రామదాసు, రాజాన రమేష్‌కుమార్, ధూళి రంగనాయకులు, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర తదితరులు శుక్రవారం రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయకుమార్, ఎంపీ సీఎం రమేష్‌కు ఘన స్వాగతం పలికేందుకు అంతా తరలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జనపరెడ్డి నర్శింగరావు, డీఎస్‌ఎన్ రాజు, ధర్మిరెడ్డి నాయుడు, కొటాపు వడ్డికాసులు, లాలం తాతబాబు, కిల్లాడ చిన్న, సన్యాసిరావు, అల్లవరపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మారిన పోలీసుల తీరు

» మీడియాపై దాడులు అరికట్టాలని విలేకరులు ఇచ్చిన వినతులపై కదలిక

» నాలుగు నెలలు తర్వాత తాజాగా విచారణ

పాడేరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలీసుల తీరు మారిందని స్పష్టమవుతున్నది. గతంలో మీడియాపై దాడుల నేపథ్యంలో జర్నలిస్టుల సంఘాలు సమర్పించిన వినతిపత్రాలను తాజాగా విచారణ చేపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అప్పటి సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాల్గొన్న సిద్ధం సభలకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లపై వరుస దాడులు జరిగాయి. ఈ దాడులను అరికట్టాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఏపీయూడబ్ల్యూజే నేతలు ఆందోళనలు, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 22న స్థానిక పాత్రికేయులు టీడీపీ నేతలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ మరుసటి రోజునే జిల్లా కలెక్టర్ స్వీకరించిన వినతిపత్రాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి బట్వాడా చేశారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండడంతో దానిపై పోలీసుల కనీసం స్పందించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో పోలీసులు ఏమనుకున్నారో? ఏమో? ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన వినతిపత్రంపై రెండు రోజుల క్రితం విచారణ ప్రారంభించారు. ఆ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు ఏ సందర్భంలో ఇచ్చారు? అల్లూరి జిల్లాలో మీడియాపై ఏమైనా దాడులు జరిగాయా? అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఘటనలపై అప్పట్లో వినతిపత్రం సమర్పిస్తే, ఇన్నాళ్లు పక్కన పెట్టిన పోలీసులు తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్పందించడం గమనార్హం.

పెదవలస చెరువు పూడ్చివేతపై ఆందోళన



జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

గూడెంకొత్తవీధి, జూన్ 21: జాతీయ రహదారి నిర్మాణంలో పెదవలస చెరువును పూడ్చివేస్తున్నారని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జాతీయ రహదారి నిర్మిస్తున్న అధికారులను శుక్రవారం వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ చెరువు దిగువన సుమారు 200 ఎకరాల సాగు భూములు ఉన్నాయని, చెరువు నుంచి పంట పొలాలకు సాగు నీరు వెళ్తున్నదని చెప్పారు. జాతీయ రహదారి నిర్మాణంలో సుమారు 30 సెంట్ల స్థలం పూడ్చి వేస్తున్నారన్నారు. దీంతో చెరువు తగ్గిపోవడం వల్ల నీటి నిల్వలు కూడా తగ్గిపోతాయని, పంట పొలాలకు సాగు నీరు అందదని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుకోవాలని కోరారు. లేనిపక్షంలో నిర్మాణాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, గ్రామ పెద్దలు కంకిపాటి శరభన్నపడాల్, పోతురాజు మోహన్‌రావు, కంకిపాటి రామారావు, మోహన్‌గాంధీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల బకాయిలు చెల్లించండి

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పాడేరు రూరల్, జూన్ 21: క్షేత్ర స్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులకు బకాయిపడ్డ 17 నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పాడేరులో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకుడు కొట్యాడ సన్యాసిరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల వైసీపీ ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించడం విచాకరమన్నారు. రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేసే తెలుగుదేశం ప్రభుత్వం నూతనంగా ఏర్పడిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అదే విధంగా ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి మౌళిక సౌకర్యాలు కల్పించాలని, ట్రావిలింగ్ అలవెన్స్‌లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.అప్పారావు, కె.వెంకటాద్రి, డి.సన్యాసిరావు, ఎం.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన



రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన తెలుపుతున్న దోనిపుట్టు గ్రామస్థులు

ముంచంగిపుట్టు, జూన్ 21: తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బూసిపుట్టు పంచాయతీ దోనిపుట్టు గ్రామస్థులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వి.సుబ్బారావు, పి.సోమన్న, పి.సన్యాసిరావు, పి.శ్రీరాములు, పి.దేవన్న తదితరులు మాట్లాడుతూ సుమారు మూడు కిలోమీటర్ల అరకొర మట్టి రహదారి దెబ్బతిందని తెలిపారు. రహదారి అధ్వానంగా మారవడంతో వాహన రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతులు అందించాలని ఫలితం కానరాలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉన్న రహదారి రూపుమారిపోయిందని, దారి పొడవునా బురద పేరుకుపోయిందని చెప్పారు. ఫలితంగా పాదచారులు సైతం అటుగా రాకపోకలు సాగించలేని దుస్థితి దాపురించిందని వాపోయారు. సంతవీధి వెళ్లే రహదారి నుంచి తమ గ్రామం వరకు పక్కా రోడ్డు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

సీలేరులో మోస్తరు వర్షం



సీలేరు ప్రధాన రహదారిపై హోరున పడుతున్న వాన

సీలేరు, జూన్ 21: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. సీలేరు ప్రాంతంలో కొన్ని రోజులుగా ఉక్కబోత, అధిక ఉష్ణోగ్రతలో జనాలు అల్లాడిపోతున్నారు. గత వారం రోజులుగా ఆకాశం మోఘాలు కమ్ముకుని ఉరుములతో ఈదురుగాలులకు వీస్తున్నా వర్షాలు మాతంౖ కురవడం లేదు. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టలేదు. శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురవడంతో జనాలు సేదదీరారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి... హాజరైన నియోజకవర్గంలోని కూటమి నేతలు

పాడేరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనులు అన్ని విధాలా నష్టపోయారని, కూటమి ప్రభుత్వంతోనే ఈ ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. కూటమి నేతలతో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇన్నాళ్లుగా గిరిజన ప్రాంతానికి జరిగిన నష్టాన్ని కూటమి ప్రభుత్వంతోనే పూడ్చగలుగుతామన్నారు. అలాగే కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఉండడం వల్ల గిరిజన ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడదన్నారు. అలాగే గత ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇతర వాటికి మళ్లించాయని, వాటిని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికే వ్యయం చేసేలా చూస్తామన్నారు. వైసీపీ రద్దు చేసిన గిరిజన పథకాలను పునరుద్ధరించడంతో పాటు గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గిరిజన ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేద్దామన్నారు. ఎన్నికల్లో కూటమి నేతలు సమన్వయంతో పని చేసిన స్ఫూర్తితోనూ భవిష్యత్తులో మన ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేద్దామని గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. అలాగే గ్రామవలంటీర్ల వినియోగంపై కూటమి నేతలు, కార్యకర్తలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దానిపై కూటమి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. మండల, గ్రామ, పంచాయతీ స్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి టీడీపీ., బీజేపీ, జనసేన శ్రేణులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత కూడ కృష్ణారావు, టీడీపీ నేతలు బొర్రా నాగరాజు, రొబ్బి రాము, చల్లంగి జ్ఞానేశ్వరి, ఐదు మండలాలకు చెందిన కూటమి నేతలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో వాడవాడలా యోగా దినోత్సవం





పాడేరు: తలారిసింగి పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు డీఈవో బ్రహ్మాజీరావు... హుకుంపేటలో యోగా అవగాహన ర్యాలీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాషా, తదితరులు

పాడేరు రూరల్/చింతపల్లి/కొయ్యూరు/జి.మాడుగుల/సీలేరు/పెదబయలు/హుకుంపేట, జూన్ 21: మన్యంలో వాడవాలా శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పాడేరు మండలంలోని తలారిసింగి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి డీఈవో పి.బ్రహ్మాజీరావు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల మనసు, శరీరం సమతుల్యతతో ఉంటాయన్నారు. మానసిక వత్తిడిని జయించేందుకు యోగా గొప్ప సాధనమన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు యోగా గొప్ప ప్రక్రియ అన్నారు. శారీరక మార్పులతో పాటు మానసిక స్థితిలో మార్పులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో కె.భాస్కరరావు, ఏఎస్‌వో జి.సింహాచలం, ఎంఈవోలు, సమగ్ర శిక్ష సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి, హెచ్ఎం జి.వరప్రసాద్, అటవీ శాఖాధికారి జి.అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.రమేష్ బాబు, జి.దామోదర్, డి.గణేష్, జి.గౌరీశంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హుకుంపేటలో డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యోగా చేసినవారికి వ్యాధులు దూరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే యోగా పాటిస్తే దీర్ఘకాలిక వ్యాధులు రావన్నారు. డాక్టర్ గాయత్రి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి యోగా చేశారు. మానవుల ఆరోగ్యానికి దోహదం చేసే యోగాను ప్రపంచ దేశాలకు ఇండియా పరిచయం చేసిందని ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ భారతి చెప్పారు. పీజీహెచ్ఎం జేఏ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, పీడీ వరలక్ష్మి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు పాల్గొన్నారు. కొయ్యూరు, శరభన్నపాలెం పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పీడీ కొండబాబు విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ యోగా రోజువారీ దిన చర్యలో భాగం కావాలన్నారు. హెచ్ఎం అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. సీలేరులో సీఆర్‌పీఎఫ్‌జీ 42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌చంద్ర పాండ్యా వైద్యాధికారి మస్తాన్‌వల్లీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ ఆసనాలను, ధ్యానం కార్యక్రమాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ రామకృష్ణ, జూనియర్ కాలేజీ విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పెదబయలు బాలుర గురుకుల కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ కచ్చితంగా యోగా చేయాలన్నారు.

మూగజీవాల పెంపకంలో మెళకువలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతన్న పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ నరసింహులు

పెదబయలు, జూన్ 21: మూగజీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలపై రైతులకు అవగహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సిహెచ్.నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పశు సంవర్ధక శాఖ సచివాలయ ఉద్యోగులు, రైతులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల సంరక్షణలో సిబ్బంది చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. అధిక పాల దిగుబడి కోసం మైదాన ప్రాంతంలో ఉండే జెర్సీ రకం ఆవులను పెంచి లబ్ధి పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వాటిని కొనుగోలు చేయడానికి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సౌజన్యంతో రాయితీ రుణాలను అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే పశువుల మేత కోసం గడ్డి విత్తనాల ద్వారా గడ్డి పెంపకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అభిమాని అయోధ్యకు సైకిల్ యాత్ర



అయోధ్య పవన్‌కల్యాణ్ వీరాభిమాని పెంటారావు

పాడేరు రూరల్, జూన్ 21: పవన్ కల్యాణ్ అసెంబ్లీలో అడుగు పెట్టడంతో పాటు మంత్రి పదవులను చేపట్టడంతో పవన్ కల్యాన్ వీరాభిమాని కొలిమల్ల పెంటారావు శుక్రవారం అనకాపల్లి నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రానికి పాడేరు చేరుకున్నాడు. పవన్ అసెంబ్లీలో అడుగుపెట్టిన మరుక్షణమే రెండు వేల కిలోమీటర్లు దూరంలో ఉన్న అయోధ్యకు సైకిల్‌పై వెళ్లానని కోరుకున్నట్టు అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన మూగవాడైన పెంటారావు పవన్ సైగలతో వివరించాడు. మార్గమధ్యంలో దాతలు అందించే సాయంతో ముందుకు సాగుతున్నానని చెప్పాడు.

ట్రాఫిక్ సమస్య నివారణకు సహకరించాలి

ముంచంగిపుట్టు, జూన్ 21: మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంత రోజు నాలుగు రోడ్ల కూడలిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అందరూ తమవంతు సహకారం అందించాలని ఎస్ఐ కె.రవీంద్ర కోరారు ప్రధాన రహదారికి ఇరువైపులా అడ్డదిడ్డంగా వాహనాలను నిలపరాదని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో అరకు, పాడేరు తప్ప మిగిలిన చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు ఓటమి చెందారు. విశాఖ, అనకాపల్లి లోక్‌స్థానాలు కోల్పోయారు. దీంతో స్టాండింగ్ కమిటీల్లో కొత్తగా ఎన్నికైన వారికి స్థానం కల్పించాలి. ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభలలో ప్రమాణంచేసినప్పటి నుంచి రెండు నెలల్లో ఈ ప్రక్రియ ముగించాల్సి ఉంది. అయితే ఈనెల 29వ తేదీన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాల సమయంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు స్థానం ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. దీంతో జడ్పీటీసీ సభ్యులతోనే సమావేశాలు నిర్వహించనున్నారు. వచ్చేనెలలో జరిగే సర్వసభ్య సమావేశంలో స్టాండింగ్ కమిటీలలో ఎంపీ/ ఎమ్మెల్యేలకు చోటు కల్పిస్తారని అధికారులు చెబుతున్నారు.

పాడేరు ఘాట్‌లో పశువుల వ్యాన్ బోల్తా



పాడేరు ఘాట్‌లో బోల్తాపడిన పశువుల వ్యాన్

పాడేరు రూరల్, జూన్ 21: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి పశువులను తరలిస్తున్న వ్యాన్ పాడేరు ఘాట్‌లోని ఏసుప్రభు మలుపు సమీపంలో గురువారం అర్ధ రాత్రి బోల్తా కొట్టింది. మండలంలోని గుత్తులపుట్టు వారపు సంతలో కొనుగోలు చేసిన పశువులను గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తుండగా ఘాట్‌లో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వ్యాన్‌లో 30 వరకు పశువులు ఉన్నట్టు ప్రమాద ఘటన సమీప గ్రామస్థులు తెలిపారు. వీటిలో కొన్ని పశువులు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మైదాన ప్రాంతానికి చెందిన పశువుల వ్యాపారి ఘటన జరిగిన రెండు గంటల వ్యవధిలోనే మరో వాహనాన్ని రప్పించి పశువులను మైదాన ప్రాంతానికి తరలించినట్టు సమాచారం. కాగా, పశువులను తరలిస్తున్న వ్యాన్ బోల్తా ఘటనపై వివరణ కోసం సీఐను సంప్రదించగా స్పందించలేదు. పశువుల అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్



బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ ఇన్‌స్టాల్ చేస్తున్న టెక్నికల్ సిబ్బంది

చింతపల్లి, జూన్ 21: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.4 లక్షల వ్యయంతో రోటరీ క్లబ్ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం టెక్నికల్ సిబ్బంది ఆర్వో ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేశారు. నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలకు ప్రభుత్వం రూ.4 లక్షల నిధులు ఖర్చుచేసి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్లాంట్ నాలుగు రోజులకే మూలకు చేరింది. దీంతో విద్యార్థినులు రక్షిత నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జేఏ కొండలరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ తక్కువ నీటిని వినియోగిస్తుందని, ఆర్వో ప్లాంట్ అందుబాటులోకి రావడంతో విద్యార్థినుల మంచినీటి ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

రూ.6 లక్షలకు వారపు సంత ఆశీలు వేలం

పెదబయలు, జూన్ 21: వారపు సంత ఆశీలు వసూలు వేలం పాట ఈసారి ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పలికింది. మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారపు సంతకు గుత్త లీజు పద్ధతిలో ఆశీలు వసూలు చేసే వేలం పాటను శుక్రవారం సీతగుంట పంచాయితీ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 12 మంది పాటదారులు పాల్గొనగా, సంపంగిపుట్టుకు గ్రామానికి చెందిన వంతాల చిట్టిబాబు రూ.6.15 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ నగదును మూడు విడతలలో పంచాయతీకి చెల్లించాల్సి ఉందని పంచాయతీ అధికారి నరసింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, ఉప సర్పంచ్ గంగాధరం, కార్యదర్శి కాశీ, వార్డు సభ్యులు గండేరు జీవన్‌కుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

పిల్లలంతా బడిలోనే ఉండాలి

పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ కూర్మారావు

జి.మాడుగుల, జూన్ 21: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ప్రత్యామ్నయ పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ కూర్మారావు స్పష్టం చేశారు. మండలంలోని నుర్మతి, వి.కోడాపల్లి, రాపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల పరిధిలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల లోపు బాలలంతా నిర్బంధ విద్యను అభ్యసించాల్సిందేనన్నారు. ఇందుకోసం వచ్చే నెల 12వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని చెప్పారు. అలాగే బడికిపోతా కార్యక్రమం విజయవంతంగా చేపట్టి బడిబయట పిల్లలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

సబ్ జైలు స్థలం పరిశీలన

చింతపల్లి, జూన్ 21: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సబ్ జైలు స్థలాన్ని తహసీల్దార్ టి.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ జైలు స్థలం ఏ శాఖ వినియోగంలోగాని, సంరక్షణలోగాని లేదన్నారు. వెబ్ ల్యాండ్ రికార్డు ప్రకారం బంజరు భూమి అని ఉందన్నారు. సబ్ జైలు నిర్వహణకు అప్పటిలో రెవెన్యూ అధికారులు 34 సెంట్ల స్థలం కేటాయించినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ స్థలం పోలీసు అవసరాలకు వినియోగించుకునేందుకు అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారని, ఈ మేరకు పరిశీలన చేశామని తెలిపారు. మ్యూటేషన్‌లో సబ్ జైలు స్థలానికి హక్కు పత్రాలు జారీ చేస్తామన్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి: సీఐ రమేశ్

జి.మాడుగుల, జూన్ 21: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలని సీఐ రమేశ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఏకాగ్రత అవసరమని చెప్పారు. అందుకు చెడు అలవాట్లకు దూరంగా ఉండి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆంకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

యూట్యూబర్ల నుంచి రక్షణ కల్పించాలి

ఏపీ హంస యూనిట్ అధ్యక్షుడు రామక్రిష్ణ

చింతపల్లి, జూన్ 21: నగదు కావాలంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్న యూట్యూబర్లు, సోషల్ మీడియా వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (హంస) తాలూకా అధ్యక్షుడు కుడుముల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. యూట్యూబ్ విలేకరులమంటూ కొందరు, కనీవిని ఎరుగని పేపర్ల పేర్లతో మరికొందరు ఉద్యోగులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావడంలేదని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తూ నగదు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. యూట్యూబర్ల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, ఉన్నతాధికారులు సైతం రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అతని వెంట ప్రధాన కార్యదర్శి సుమ సుందర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

పెదబయలు, జూన్ 21: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఏటీడబ్ల్యూవో స్వర్ణలత ఆదేశించారు. మండలంలోని మారుమూల ప్రాంతాలలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గోమంగి పంచాయతీలోని వన్నాడా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం గిన్నెలకోట పంచాయితీ ఇనుపతీగల పాఠశాలను, బొంగరం పంచాయితీ వంచుర్బ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహం ఆవరణలో మెనూ చార్ట్ లేదని గమనించి ప్రిన్సిపాల్‌ను మందలించారు. అలాగే తక్షణమే చార్ట్ ప్రదర్శించాలని ఆదేశించారు. తరచూ స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు జీపీఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

వైసీపీ దందా

... 3వ పేజీ తరువాయి

అనుమతులు ఉన్నాయా అని జీవీఎంసీ ఏసీపీ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. గత ఏడాది ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, అయితే ఇంకా అప్రూవ్ కాలేదని తెలిపారు.

స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా...

ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తూరు, నర్సింగరావుపేట, పోర్టు కాలనీ, సిరసపల్లి, సుబ్రహ్మణ్య కాలనీ వాసులు అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఈ స్థలంలో కొంతభాగం సామాజిక అవసరాలకు కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకుంటామని వారు కోరుతున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలే తప్ప పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయిస్తారంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కనీసం పట్టించుకోలేదు. జీవో 340 ప్రకారం స్థలాన్ని కేటాయించామని అప్పట్లో రెవెన్యూ అధికారులు చెప్పుకొచ్చారు. దీనిపై సంతృప్తి చెందని స్థానికులు 2023 జూన్ నెలలో హైకోర్టులో కేసు కూడా వేశారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు

... 3వ పేజీ తరువాయి

వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేయగా.. తమ సిబ్బంది అప్రమత్తమై పట్టుకున్నారన్నారు. అనంతరం కారులో తనిఖీ చేయగా 16 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా.. ఉత్తరప్రదేశ్‌కి చెందిన గంజాయి వ్యాపారులు నీతు, రానా, రవీంద్ర కుమార్‌గా గుర్తించామన్నారు. ఈ గంజాయి రవాణాతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. నిందితుల నుంచి కారు, గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.85 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.